


బుల్లెట్టు బండెక్కి..



బుల్లెట్ బైక్‌పై స్టైల్‌గా కనిపిస్తున్నది ఎస్పీ బిందుమాధవ్. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఎస్పీ ఇలా హెల్మెట్ ధరించి బైక్ నడిపారు. శుక్రవారం హెల్మెట్ ధరించడంపై కర్నూలు ట్రాఫిక్ పోలీసులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ హెల్మెట్‌ను ధరించి బుల్లెట్ బండిని డ్రైవ్ చేసి ఆకర్షణగా నిలిచారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జి.హుస్సేన్‌పీరా, డీఎస్పీ జే బాబు ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

-కర్నూలు క్రైం, (ఆంధ్రజ్యోతి)

ఆదోని మార్కెట్ యార్డుకు ఆధునిక సొబగులు



ఆదోని మార్కెట్ యార్డ్

- అభివృద్ధి పనులకు రూ.21 కోట్లతో ప్రతిపాదనలు
- రైతులకు మౌలిక వసతుల కల్పన
- గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలో ఆదోని మార్కెట్ కమిటీపై దృష్టి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం మార్కెట్ కమిటీల అభివృద్ధిని విస్మరించింది. ఫలితంగా మార్కెట్ యార్డుల్లో విక్రయానికి తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కూడా నోచుకోలేదు. రూ.కోట్ల ఆదాయం ఉన్న పనులు చేపట్టలేని పరిస్థితి. కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ అభివృద్ధిపై దృష్టి సారించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ. ఇక్కడ నిత్యం వేల వ్యవసాయ పంట ఉత్పత్తులకు క్రయవిక్రయాలు, జిల్లా రైతులే కాకుండా పక్క జిల్లాలైన అనంతపురం, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ ప్రాంత రైతులతో కళకళలాడుతుంది. ఏటా రూ.1800 కోట్లు ప్రత్యక్షంగా, మరో రూ.200 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతాయి. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల సెస్సు రూపంలో ఏడాదికి రూ. 16 నుంచి రూ.18 కోట్లు ఆదాయం సమకూరుతుంది. జాతీయ స్థాయిలో ఈ-నామ్ బిడ్డింగ్ దాఖలలో గుర్తింపు పొందింది. రైతులకు పోటీతత్వం ద్వారా మంచి ధర, తూకాల్లో చెల్లింపుల్లో పారదర్శకత, వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపుతున్న మార్కెట్ కమిటీని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల అభివృద్ధి కుంటుపడింది. ఐదేళ్లలో నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయకపోవడంతో వారు పనులు చేయకుండా వెనక్కి వెళ్లారు. రైతులు కనీస వసతులకు కూడా నోచుకోలేకపోయారు. వర్షానికి పంట ఉత్పత్తులు మార్కెట్‌లో తడిసి కొట్టుకుపోయిన సందర్భంగా తీవ్రంగా నష్టపోయారు. వీటన్నింటిని కూటమి ప్రభుత్వం చక్కుదిద్ది నిధులు కేటాయించే పనిలో పడింది. ఇటీవల మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయదుర్గ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ డీఈ సుబ్బారెడ్డిని ఆదేశించారు. ఎమ్మెల్యే పార్థసారధి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సైతం మార్కెట్ యార్డుపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో సైతం గళం విప్పారు. మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపునకు రూ.21.48 కోట్లు అవుతుందని నివేదిక తయారు చేసి అధికారులకు అందజేశారు. ఆమోదం తెలిపితే మార్కెట్ యార్డ్‌కు నూతన సొబగులు సంతరించుకోనున్నాయి.



రైతు విశ్రాంతి భవనం

మిగతా 7లో

నేడు ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక

- జల మండలిలో ఏర్పాట్లు చేసిన ఇంజనీర్లు
- టీబీపీ ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టులకు ఎన్నికలు



టీబీపీ ఎల్లెల్సీ, జీడీపీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలకు వేదికైన జల మండలి కార్యాలయం

కర్నూలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక శనివారం జరగనుంది. ఈ మేరకు కర్నూలు నగరం ఐదు రోడ్ల కూడలిలోని జల మండలి కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్లెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఆథరైజ్డ్ అధికారి, జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డి, గాజులదిన్నె ప్రాజెక్ట్ కమిటీ (పీసీ) ఆథరైజ్డ్ అధికారి, ఆదోని సబ్ కలెక్టర్ ఎం.మౌర్యభరద్వాజ్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరగనుంది. .

జీడీపీ పీసీ చైర్మన్ ఏకగ్రీవమే..!

గాజులదిన్నె ప్రాజెక్ట్ (జీడీపీ) కమిటీ పరిధిలో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి హెచ్.కైరవాడి, ఒంటెడుదిన్నె, తిప్పనూరు, ఎ.లింగందిన్నె, కున్నూరు, కోడుమూరు నియోజకవర్గంలో కోడుమూరు, ముడుమలగుర్తి, గోరంట్ల, పత్తికొండ నియోజకవర్గానికి చెందిన పోతుగల్లు, మొన్నెంకుంట, ఎర్రగుడి, తొగరచేడు సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే.. కోడుమూరు సాగు నీటి సంఘం అధ్యక్షుడు కేశ మల్లికార్జునగౌడ్ పేరు దాదాపుగా ఖరారు చేశారు. జీడీపీ పీసీ చైర్మన్‌గా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉందని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు.

నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఎస్పీ జి.బిందుమాధవ్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కోసిగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరాల నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం కోసిగి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లో రికార్డులను ఆయన పరిశీలించారు. ముందుగా ఎస్పీకి సీఐ మంజునాథ్, కోసిగి, పెద్దకడుబూరు ఎస్ఐలు చంద్రమోహన్, నిరంజన్‌రెడ్డి గౌరవ వందనం చేశారు. అనంతరం సర్కిల్ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులను, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతిపై కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కువగా గ్రామంలో పోలీసింగ్ చేపట్టాలని, సమర్థవంతమైన నేర నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై, మహిళా చట్టాలపై, నూతన చట్టాలపై ప్రతి గ్రామానికి వెళ్లి పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కోసిగి సర్కిల్ కార్యాలయ పరిసరాలను పరిశీలించి ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎస్‌బీ సీఐ ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్‌బాబు, కోసిగి, పెద్దకడుబూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్వకల్లులో రూ. 14 వేల కోట్ల పెట్టుబడులు

కంపెనీ ప్రతినిధులతో మంత్రి టీజీ భరత్



కంపెనీల ప్రతినిధులతో మంత్రులు లోకేశ్, టీజీ భరత్

కర్నూలు అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ.14 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. అమరావతిలో ఐటీశాఖ మంత్రి లోకేశ్‌తో కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాయలసీమలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని సమావేశంలో పెట్టుబడిదారులతో చర్చించినట్లు తెలిపారు. జనవరి రెండో వారంలో సీఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీతో ఎంఓయూ చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ దూరదృష్టితోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పారిశ్రామిక అభివృద్ధిని పెంచడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నా చంద్రబాబు ఆలోచనలకు ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు వస్తాయన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమైందన్నారు.

అప్పుడు తప్పు.. ఇప్పుడు ఒప్పా..?



బందర్లపల్లె చెక్‌పోస్టు వద్ద లోడ్ వాహనాలతో రోడ్డు దిగ్బంధనం చేసిన నాపరాయి పరిశ్రమ యజమానులు

- నాడు విమర్శలు చేసి నేడు చేస్తున్నదేమిటి..?
- 'కూటమి'పై నాపరాయి పరిశ్రమల యజమానుల అసంతృప్తి
- గత ప్రభుత్వ విధానాన్నే అమలు చేస్తోందని ఆగ్రహం
- కన్సిడరేషన్ పన్ను చెల్లించాలనడంపై సర్వత్రా ఆందోళన
- ఉపాధి లేక రోడ్డున పడుతున్న కార్మికులు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు తెగ విమర్శలు చేశారు. కన్సిడరేషన్ పన్నుతో నాపరాయి పరిశ్రమ మూతబడేలా చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమ వర్గాల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత రావడంతో గత ప్రభుత్వం పన్ను వసూలు వసూలు చేయడం ఆపేసింది. అయితే అప్పట్లో వైసీపీ తీరు సరైంది కాదని చెప్పుకొచ్చిన టీడీపీ నేతలు అధికారంలోకి రాగానే అదే విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో పరిశ్రమ యజమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం చేసింది తప్పయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్నది ఒప్పా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం నాపరాయి పరిశ్రమలు నడవలేని పరిస్థితికి వచ్చాయి. ఉపాధి లేక వందలాది మంది కార్మికులు రోడ్డున పడుతున్నారు. ఇప్పటికైనా కన్సిడరేషన్ పన్ను చెల్లింపులను ఆపాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

నంద్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జిల్లాలో నాపరాయి పరిశ్రమ ఓ వెలుగు వెలిగింది. ముఖ్యంగా బనగానపల్లె నియోజకవర్గంతో పాటు, బేతంచర్ల వంటి ప్రాంతాల్లో ఈ పరిశ్రమలు ఎక్కువగా ఉండేవి. దీనిపైన వందలాది మంది జీవనోపాధి పొందేవారు. వైసీపీ వచ్చాక ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. లేనిపోని నిబంధనలు పెట్టడంతో పాటు, ఇష్టారీతిన పన్నులు వేయడంతో నాపరాయి పరిశ్రమ పూర్తిగా దెబ్బతింది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత తమ బతుకులు మారతాయని ఆశించిన పరిశ్రమ యజమానులకు అవే తిప్పలు తప్పడం లేదు. అప్పట్లో తీసుకువచ్చిన జీవోలను ఇప్పుడు అమలు చేసి నాపరాయి పరిశ్రమ లేకుండా చేసేందుకు పూనుకుందనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి కన్సిడరేషన్ ఫీజు తొలగించటమే కాకుండా గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు, విధానాలను మార్చి పరిశ్రమను ఆదుకోవాలని పరిశ్రమ యజమానులు కోరుతున్నారు.


మిగతా 6లో,,

ఏమిటీ కన్సిడరేషన్ ఫీజు..?

కొవిడ్ తర్వాత అన్ని రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ ఖజానాకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో కొవిడ్ వల్ల నష్టపోయిన పరిశ్రమలను తిరిగి గాడిలో పెట్టేందుకు, కార్మికులకు ఉపాధి కల్పించడానికి, చిన్న తరహా పరిశ్రమల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వద్ద సరైన నిధులు లేకపోయాయి. ఇందుకోసం మైనింగ్ పరిశ్రమల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం పూనుకుంది. దీనికి కన్సిడరేషన్ ఫీజు అని పేరు పెట్టింది. ఆయా మైనింగ్ పరిశ్రమల నుంచి వసూలు చేస్తున్న సీనరేజి పన్ను, డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్), మెరిట్ ఫీజుతోపాటు అదనంగా ఈ కన్సిడరేషన్ ఫీజు కట్టాలని ఆదేశిస్తూ 2021 జూన్‌లో జీఓఎంఎస్ నంబరు 42 విడుదల చేసింది. దీని ప్రకారం ఇసుక, సిలికా వంటి వాటికి సీనరేజ్ పన్ను మొత్తానికి వంద శాతం అదనంగా కన్సిడరేషన్ ఫీజు వసూలు చేసింది. గ్రానైట్ ధర ఎక్కువ కావటంతో కన్సిడరేషన్ పన్ను వంద శాతం వసూలు చేస్తే ఆ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడుతుందని భావించి, కన్సిడరేషన్ పన్నును 50 శాతానికి కుదించింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా భారీ ఖనిజాలకు సంబంధించిన పరిశ్రమలకు వర్తింపజేసే నిబంధనలనే నాపరాయి పరిశ్రమకు వర్తింపజేసింది. అంతంతమాత్రం ఆదాయం ఉండే నాపరాయి పరిశ్రమ యజమానులు కూడా వంద శాతం కన్సిడరేషన్ ఫీజు కట్టే పరిస్థితి ఏర్పడింది.



2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చి కన్సిడరేషన్ పన్ను జీఓ



మూతపడిన నాపరాయి పరిశ్రమ యూనిట్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- జీవో నెం.77ను రద్దు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంటు స్కాలర్‌షిప్ రూ.3,580 కోట్లను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థుల ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో.నెం.77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను విడుదల చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,100 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంటు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రూ.1,480 కోట్లు వసతి దీవెన పెండింగ్‌లో ఉందని, వీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆ హాస్టల్లో తలుపులు, కిటికీలు సరిగా ఉండవు. వర్షం వస్తే గోడలకు నెమ్ము వస్తుంది. గదుల పైపెచ్చు తరచూ ఊడి పడుతూ ఉంటుంది. టాయిలెట్లు, స్నానపు గదుల పని తీరు అంతంత మాత్రమే. ఇన్ని సమస్యల మధ్య సుమారు 450 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కోడుమూరు మండలంలోని లద్దగిరి గ్రామంలో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం 1, 2 ఉన్నాయి. ఇక్కడ వివిధ ప్రాంతాల పేద విద్యార్థులు చేరారు. సీట్లు పొందిన వారిలో 4 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారు.



ఆ హాస్టల్‌లో అన్నీ సమస్యలే..!



బాలుర వసతి గృహం

కోడుమూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లద్దగిరి బీసీ బాలుర వసతి గృహం-1లో 250 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో మూడు భవనాలు ఉన్నాయి. ఆయా భవనాల్లో ఒకదాంట్లో 10 గదులు ఉండగా 8 గదులు దెబ్బతిన్నాయి. ఇందులో బాగున్న రెండు గదులను సామగ్రి, కూరగాయలు, పప్పు దినుసులకు వాడుతున్నారు. దెబ్బతిన్న 8 గదులకు పైపెచ్చులు ఊడుతోంది. కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ కూడా సరిగా లేదు. వర్ష తుంపరలు, దోమలు, చలి మధ్యనే విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి. ఈ భవనాలు సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించినట్లు తెలుస్తోంది. వసతి గృహం -2లో 200 మంది విద్యార్థులు ఉండగా, మొత్తం మూడు హాళ్లు ఉన్నాయి. ఇందులో రెండు హాళ్లు అధ్వానంగా ఉన్నాయి. ఒక హాల్ మాత్రమే బాగుంది. రెండు హాస్టళ్లకు కలిపి బాత్రూంలు 10, టాయిలెట్లు 32 ఉన్నాయి. 12 టాయిలెట్లు మాత్రమే బాగున్నట్లు అంటున్నారు. మరుగుదొడ్ల కొరతతో మలవిసర్జనకు విద్యార్థులు సమీప పొలాల్లోకి వెళ్తున్నారు. ఇక స్నానానికి ఇబ్బందులు తప్పడం లేదు. హాస్టల్ ప్రాంగణంలో ఉన్న మినీ ట్యాంకు వద్దనే స్నానాదులు ముగిస్తున్నారు. వాస్తవానికి ప్రతి పది విద్యార్థులకు ఒక్కోటి చొప్పున బాత్రూం, టాయిలెట్ ఉండాలి. హాస్టల్‌కు తాగునీటి సరఫరా కోసం రెండు ట్యాపులు ఉన్నాయి. కిచెన్ షెడ్ దెబ్బతింది. షెడ్ ఎపుడైనా కూలవచ్చు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో హాస్టల్-1లో ఉన్న విద్యార్థులను భద్రత దృష్ట్యా పక్కనే ఉన్నత పాఠశాలలోకి మార్చారు. పాఠశాలలో నాలుగు గదులను హాస్టల్ విద్యార్థులకు కేటాయించారని వార్డెన్ రమేష్ తెలిపారు. దీంతో 1వ హాస్టల్ విద్యార్థులు పాఠశాల గదుల్లోకి మకాం మార్చారు. అదీను ఈ ఏడాది ఆఖరు వరకు మాత్రమేనని తెలిసింది. ఇంకో సమస్య హాస్టల్ వెనుక భాగంలో ప్రహరీ ఎత్తు పెంచాల్సిన అవసరం కూడా ఉంది. వర్షాకాలంలో ప్రాంగణంలో నీరు నిలిచి బురదగా మారుతుంది.

భవనాలను నూతనంగా నిర్మించాలి



లద్దగిరి హాస్టళ్లలో సమస్యల మధ్యనే విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. పలు గదులు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారాయి. గదులకు తలుపులు, కిటికీలు కూడా సరిగా లేవు. చాలా వరకు టాయిలెట్లు పని చేయక విద్యార్థులు బయటకు వెళ్లే పరిస్థితి నెలకొంది. స్నానపు గదులు కూడా తగినన్ని లేవు. అధికారులు స్పందించి దెబ్బతిన్న వాటి స్థానంలో నూతనంగా నిర్మించాలి.

- రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ నాయకుడు

అధికారులు పరిశీలించారు

హాస్టల్ భవనాలను అధికారులు పరిశీలించారు. చాలా కాలం కిందట నిర్మించినందున పెచ్చులూడుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాస్టల్ 1లో విద్యార్థులను పక్కనే ఉన్నత పాఠశాల గదుల్లోకి మార్చాం. గతంలో హాస్టల్‌ను పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు.

-రమేష్, వార్డెన్

లద్దగిరి వసతి గృహంలో విద్యార్థుల ఇబ్బందులు



మరుగుదొడ్ల దుస్థితి



కూలేందుకు సిద్ధంగా ఉన్న వంట గది



పెచ్చులూడిన పైకప్పు

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూల లీగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు కోర్టుకు వెళ్లకుండా మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తే సత్వర న్యాయం పొందవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది తెలిపారు. మధ్యవర్తిత్వంపై స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటలపాటు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు అన్ని జిల్లా కోర్టుల్లో మధ్యవర్తిత్వాన్ని ప్రవేశపెట్టాలని తీర్మానించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీవరకు మధ్యవర్తిత్వం ఎలా నిర్వహించాలనే అంశంపై చెన్నై, బెంగుళూరు నుంచి వచ్చిన సిబ్బంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, శిక్షకులు ఎస్. అరుణాచలం, ఎస్ఎన్ సుధ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

సంఘాలకు మళ్లీ ఇన్‌చార్జిల పాలనే..

- 2018 నుంచి ఇదే పరిస్థితి
- రైతులకు దక్కని రుణాలు



కల్లూరు వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. ఈసారి ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, పదవులను దక్కించుకోవచ్చని నాయకులు వారి అనుచరులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలతోపాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు మరో ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జిలే పదవిలో కొనసాగుతారని జిల్లా సహకార అధికారి రామాంజనేయులు తెలిపారు.

ధరలన్నీ ఢమాల్..

క్వింటంపై రూ.1000 కంటే ఎక్కువే పడిపోయింది

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన పంట ఉత్పత్తుల ధరలన్నీ పతనమైపోయాయి. ప్రధానంగా వేరుశనగ కాయలు గత నెల రూ.6 వేలకు పైగానే ధర ఉండగా ప్రస్తుతం రూ.5,900 మాత్రమే రైతుకు దక్కింది. మధ్యస్థ ధర రూ.5,301, కనిష్ఠ దర ఘోరంగా రూ.2,811 మాత్రమే దక్కింది. ప్రభుత్వం వేరుశనగ కాయలకు రూ.6,700 మద్దతు ధర ప్రకటించింది. వెంటనే మార్క్‌ఫెడ్ అధికారులు కర్నూలు మార్కెట్ యార్డులో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఉల్లిగడ్డల ధర మరింత దిగజారి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వారం రోజుల కిందట రూ.4వేలకు పైగానే గరిష్ఠ ధర ఉండగా శుక్రవారం గరిష్ఠ ధర రూ.3,009, మధ్యస్థం రూ.2,459, కనిష్ఠం రూ.1,429 మాత్రమే దక్కింది. ఎండుమిరప కాయలది కూడా అదే పరిస్థితి. గత సంవత్సరం ఇదే సమయంలో క్వింటం ఎండుమిర్చి గరిష్ఠ ధర రూ.30 వేలకు అమ్ముడుపోగా ప్రస్తుతం గరిష్ఠ ధర రూ.15,513, మధ్యస్థం రూ.12,869, కనిష్ఠం ఘోరంగా రూ.1,699 మాత్రమే దక్కింది. కొర్రలకు గరిష్ఠ ధర రూ.2669, మధ్యస్థం రూ.2491, కనిష్ఠం రూ.1,891 లభించింది. సజ్జలకు గరిష్ఠ ధర రూ.2,329, మధ్యస్థం రూ.2,109, కనిష్ఠ ధర రూ.2,109 పలికింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,330, మధ్యస్థ ధర రూ.2,259, కనిష్ఠ ధర కూడా రూ.2,259 అందింది. కందులకు ధర పూర్తిగా పతనమవుతోంది. నిన్నమొన్నటి దాకా రూ.9,500 నుంచి రూ.9వేలకు పైగానే రైతుకు లభించగా శుక్రవారం గరిష్ఠం రూ.8,019కు పడిపోయింది. మధ్యస్థ ధర రూ.7519, కనిష్ఠ ధర రూ.2,889 మాత్రమే దక్కింది. కందులకు గరిష్ఠ ధర రూ.4,599, మధ్యస్థ ధర రూ.4,006, కనిష్ఠ ధర రూ.1000 మాత్రమే దక్కింది.



అప్పుడు తప్పు.. ఇప్పుడు ఒప్పా..?

(5వ పేజీ తరువాయి)

గతం వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కన్సిడరేషన్ పన్నుపై నాపరాయి పరిశ్రమ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ఈ పన్నును అప్పట్లో వసూలు చేయలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అప్పటి నుంచి ఉన్న బకాయి కన్సిడరేషన్ పన్ను వసూలుకు సిద్ధమైంది. అంటే ఈ లెక్కన వైసీపీ నిబంధనలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లే లెక్క. మరి అప్పట్లో వైసీపీ విధానాలు సరైనవి కావని చెప్పుకొచ్చిన టీడీపీ నేతలు, అధికారంలోకి రాగానే ఎలా అమలు చేస్తున్నారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం చేసింది తప్పయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్నది కూడా తప్పు కాదా అన్న వాదన వినిపిస్తోంది. ఈ విమర్శలు ఏమీ పట్టించుకోని కూటమి ప్రభుత్వం కన్సిడరేషన్ పన్నును నాపరాయి పరిశ్రమపై బలంగా రుద్దుతోంది. రెండు మూడు రోజుల క్రితం నుంచి నాపరాయిని రవాణా చేసేందుకు సంబంధిత యజమానులు ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తు చేస్తుండగా వారికి కన్సిడరేషన్ పన్ను అంటూ లక్షల రూపాయిల బకాయిలను చూపుతోంది.

మూతబడుతున్న నాపరాయి పరిశ్రమ..

ఒకప్పుడు ఇల్లు కట్టుకునే ప్రతివారు నాపరాయిని వాడేవారు. ప్రస్తుతం అంతా గ్రానైట్, టైల్స్ వైపు చూస్తున్నారు. దీంతో జిల్లాలోని నాపరాయి పరిశ్రమ పూర్తిగా దెబ్బతింటోంది. నాపరాయి పరిశ్రమలను ఆదుకుని, దీనిపైన ఆధారపడిన వారికి మేలు చేకూర్చేలా నిబంధనలు సడలించాల్సిన గత ప్రభుత్వం మరిన్ని కఠిన నిబంధనలను తీసుకువచ్చింది. ఖనిజాల్లో మేజర్, మైనర్ అంటూ విభాగాలు ఉంటాయి. మేజర్ ఖనిజ పరిశ్రమలు పెట్టాల్సిన నిబంధనలను నాపరాయి పరిశ్రమకు వర్తింపజేసింది. దీంతో ఈ పరిశ్రమ మరింత ఇబ్బందుల్లో పడింది. పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేని నాపరాయి పరిశ్రమకు కూడా నిబంధన విధించింది. లైసెన్సు ఫీజును భారీగా పెంచేసింది. కొత్తగా లైసెన్సు తీసుకోవడానికి అయ్యే ఖర్చు కంటే రెన్యువల్ చేసే వారి నుంచి మరింత ఎక్కువ ఫీజు వసూలు చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న నాపరాయి పరిశ్రమలు నడవలేని పరిస్థితికి వచ్చాయి. ఏ స్థాయిలో అంటే జిల్లా వ్యాప్తంగా నాపరాయి పరిశ్రమలు 200 కాస్త, 40కి పడిపోయాయి. మిగతావన్నీ కఠిన నిబంధనల వలలో చిక్కుకుని రెన్యువల్ అవలేదు.

ఆదుకోని కూటమి ప్రభుత్వం..

వైసీపీ ప్రభుత్వ తీరుతో ఎక్కువ సంఖ్యలో నాపరాయి పరిశ్రమలు మూతపడటంతో దీనిపైన ఆధారపడిన వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. వీరిని ఆదుకుంటామని, 2014-2019 వరకు ఏ నిబంధనలు ఉన్నాయో వాటినే అమలు చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం వారి గురించి పట్టించుకున్నది లేదు. పైగా 2019-2024 వరకు వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే అనుసరిస్తోంది. పైగా కన్సిడరేషన్ పన్నును తీసేస్తుండా అంటే వచ్చే నెల 10 వరకు పెండింగ్ బకాయిలు చెల్లించే వెసులుబాటు కల్పిస్తామని, కానీ తర్వాతైనా బకాయిలు చెల్లించాల్సిందేనని జిల్లా మైనింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు పెండింగ్ బకాయిలు కట్టినట్లు రశీదు ఉంటేనే రవాణాకు అనుమతిస్తామని చెక్‌పోస్టు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవటంపైన, ప్రభుత్వ శాఖల ద్వంద్వ వైఖరిపైన విసిగెత్తిపోయిన నాపరాయి పరిశ్రమ యజమానులు కడుపు మండి ధర్నాలకు దిగుతున్నారు. రెండ్రోజుల కింద నంద్యాల, అనంతపురం చెక్‌పోస్టు వద్ద వందలాది నాపరాయి లోడు వాహనాలను అడ్డుగా పెట్టి రోడ్డు దిగ్బంధనం చేయగా గురువారం బేతంచర్లలో రోడ్డుపైన ధర్నా చేశారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించదని, ఇలా రూ.లక్షల్లో పన్నులు వసూలు చేస్తే ఉన్న కొద్ది రోజుల్లో నాపరాయి పరిశ్రమలు మూతపడటం ఖాయమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ప్రభుత్వానికి పడిపోయిన ఆదాయం

జిల్లాలోని నాపరాయి పరిశ్రమల నుంచి ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రూ.12 కోట్లు, డీఎంఎఫ్ రూపంలో మరో రూ.1.20 కోట్లు, మెరిట్ రూపంలో మరో రూ.20 లక్షలు, ఇతర పన్నుల రూపంలో సంవత్సరాదాయం దాదాపు రూ.14 కోట్లు వచ్చేది. కానీ వైసీపీ విధానాల వల్ల ఈ ఆదాయం రూ.3 కోట్లకు పడిపోయింది. ఈ లెక్కన గత జగన్ ప్రభుత్వం జిల్లాలోని నాపరాయి పరిశ్రమను ఏ విధంగా నాశనం చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఇక 'సంపద సృష్టిస్తాం.. అందరికీ పంచుతాం' అంటూ వచ్చిన కూటమి ప్రభుత్వం ఖజానాకు నష్టం చేకూర్చే విధానాలను పట్టుకుని ఎందుకు వేలాడుతోందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా మంత్రులు, కూటమి నాయకులు సీఎం చంద్రబాబు నాయుడికి వివరించి కన్సిడరేషన్ ఫీజు వసూలును నిలిపేయాలని పరిశ్రమ యజమానులు కోరుతున్నారు.




గురువారం బేతంచర్లలో లోడ్ వాహనాలతో నాపరాయి పరిశ్రమ యజమానుల ధర్నా

నాపరాయి పరిశ్రమ యజమానుల కష్టాలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం

నాపరాయి కన్సిడరేషన్ ఫీజుపై నాపరాయి గనుల యజమానుల నిరసన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాం. నాలుగు రోజుల నుంచి కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాలను నిలిపి ధర్నా చేసిన విషయంపై ప్రభుత్వానికి నివేదించాం. మైనింగ్ యజమానులకు ఆన్‌లైన్‌లో రూ.లక్షల్లో కన్సిడరేషన్ ఫీజు చూపుతోంది. ఈ విషయాన్ని రోడ్లు భవనాల శాఖామంత్రి దృష్టికి తీసుకు వెళ్లాం. రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఒక నిర్ణయం వెలువడనుంది.

-రాజగోపాల్, మైనింగ్ ఏడీ

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం



నాపరాయి పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా దృష్టికి తీసుకెళ్లాను. గతంలో నాపరాయి పరిశ్రమకు ఇచ్చిన హామీలను కూడా వారికి గుర్తు చేశాను. దీనిపైన వచ్చే నెల మొదటి వారంలో గనుల శాఖ మంత్రి, ముఖ్య అధికారులతో చర్చలు జరిపి ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరించి నాపరాయి పరిశ్రమను ఆదుకుంటాం.

- బీసీ జనార్దన్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి

పంటల బీమా ప్రీమియం గడువు పెంపు

రైతులకు మరో అవకాశం



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీలో పంటలు సాగు చేసిన రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పంటల బీమాకు చెల్లించే ప్రీమియం గడువు ఈ నెలాఖరు వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులు, రైతు సంఘాల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేంద్రం స్పందించింది. ప్రీమియం చెల్లించే రైతులు 50 శాతానికి పైగా ఉన్నారని గడువు పెంచాలని విజ్ఞప్తి చేయడంతో కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీ సీజన్‌లో అనేక వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు దెబ్బతినకుండా బీమా పొందే అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ప్రధానమంత్రి ఫసల్‌బీమా, వాతావరణ ఆధారిత బీమా కింద ప్రీమియం చెల్లించకుండా మిగిలిపోయిన రైతులకు ప్రయోజనం కల్పించాలని కోరింది. వరి, జొన్న, మినుము, వేరుశనగ, పొద్దుతిరుగుడు, పెసర పప్పుశనగ, మామిడి పంటలను బీమా పరిధిలోకి చేర్చింది. రుణం తీసుకున్న రైతులకు వారి తరపున బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయి. మిగిలిన రైతులు ప్రీమియాన్ని ఈ నెలాఖరులోపు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు గురువారం వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయానికి చేరాయి. మొదటి పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు వరికి మాత్రమే డిసెంబరు 31 వరకు మిగిలిన పంటలకు 15 వరకు మాత్రమే గడువు విధించారు. ఈ గడువు ఈనెలాఖరు వరకు పొడిగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి

రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. ఈ నెలాఖరు వరకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులంతా తప్పనిసరిగా ఈ నెలాఖరులోగా వివిధ పంటలకు నిర్ణయించిన ప్రీమియంను వెంటనే చెల్లించాలి.

- శాలురెడ్డి, ఏడీఏ

పంట	ప్రీమియం (హెక్టారు) రూ.లలో
శనగ	రూ.1,200లు
వరి	రూ.1,575
జొన్న	రూ.787.50
పెసర	రూ.675
మినుములు	రూ.712.50
వేరుశనగ	రూ.1,200
నువ్వులు	రూ.450
పొద్దుతిరుగుడు	రూ.750
మామిడికి	రూ.2,100 (ఎకరాకు)
టమోటా	రూ.2,100 (ఎకరాకు)

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

● రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, రైతుసంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా. బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అనుచిత వ్యాఖ్యలతో అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ, దళిత హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో కేంద్ర హోం శాఖ మంత్రిగా పదవులు అనుభవిస్తూ ఆ హక్కుల కల్పించిన అంబేడ్కర్‌ను అవమానపరచడం దారుణమన్నారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆలోచనలు దేశ ప్రజలు గమనిస్తున్నారని, ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం అమిత్‌షా చిత్రపటాలను దహనం చేయడానికి సీపీఐ నాయకులు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, సీపీఐ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి. రామక్రిష్ణారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, సమితి జిల్లా కార్యదర్శి మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

కర్నూల లీగల్: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంటులో అవమానించిన ఘటనలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వై. జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పాతబస్టాండులోని బాబా సాహెబ్ అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాణంలో డా. అంబేడ్కర్ కృషి ఎనలేనిదని, హోం మంత్రి అంబేడ్కర్‌ను విమర్శించడం శోచనీయం అని ఆయన తెలిపారు.

● **ఐలూ ఖండన :** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ గురించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) కర్నూలు జిల్లా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కే. కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎస్. లక్ష్మణ్ ఒక ప్రకటనలో ఖండించారు. దేశ చరిత్ర తెలియని వ్యక్తులు అధికారంలో ఉంటే ఇటువంటి వ్యాఖ్యలే వినాల్సి వస్తుందని విమర్శించారు.

ఓర్వకల్లులో సెమీ కండక్టర్ పరిశ్రమ

- రూ.14 వేల కోట్లతో మొట్టమొదటగా ఏర్పాటు
- 25-30 ఎకరాల్లో హైకోర్టు బెంచ్ ఐకాన్ భవనం
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కలెక్టరేట్‌లో క్రిస్మస్ హై టీ కార్యక్రమానికి హాజరు



హైటీలో భాగంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో తొలి సెమీ కండక్టర్ పరిశ్రమ కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన క్రిస్మస్‌ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన హైటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఓర్వకల్లులో రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమ రావడం క్రిస్మస్ కానుక అన్నారు. ఆ పరిశ్రమ మన జిల్లాకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఎక్కువగా చైనా, తైవాన్ వంటి దేశాల్లో ఈ పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపుతారని, తొలిసారిగా ఇండియాకు రావడం, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ఆ కంపెనీ ప్రతినిధులు నిర్ణయిస్తే.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో రాష్ట్రానికి వచ్చిందని అన్నారు. జనవరి రెండో వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సెమీ కండక్టర్ కంపెనీ ప్రతినిధులతో ఎంవోయూ కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. రెండు రెండున్నర ఏళ్లలో ఈ పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తులు ప్రారంభించేందుకు కంపెనీ ప్రతినిధులు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ రావడంతో అనుబంధ పరిశ్రమలు కూడా వస్తాయని, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కర్నూలు హైకోర్టు బెంచ్‌కు ఐకాన్ భవనం నిర్మాణం చేస్తున్నామని, రాబోయే మంత్రివర్గం సమావేశం నాటికి హైకోర్టు బెంచ్ భవనం నిర్మాణం కోసం 25-30 ఎకరాలు సేకరించి తుది ఫైలుతో రావాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మానవాళికి క్రీస్తు జీవితం ఓ సందేశం అన్నారు. కలెక్టర్ పి. రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణ క్రీస్తు బోధనలని అన్నారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీస్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు, సీనియర్ పాస్టర్లు సహా నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, పర్యాటక శాఖ డైరెక్టర్ ముంతాజ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దరూర్ జేమ్స్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సబీహాపర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో ప్రతిభ

జిల్లాకు ఏబీసీడీ అవార్డు

కర్నూలు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేసుల పురోగతిలో కర్నూలు జిల్లా పోలీసులు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కేసుల విచారణలో విశేష ప్రతిభ చూపడంతో పాటు విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొస్తున్నారు. కేసుల పూర్వాపరాలు, కేసుల పరిష్కారంలో వినియోగించిన సాంకేతికత, వినూత్న విధానాలతో జిల్లా పోలీసులు సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలో అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్ (ఏబీసీడీ) అవార్డును దక్కించుకున్నారు. ఈ అవార్డును తాజాగా డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి ఎస్పీ బిందుమాధవ్ అందుకున్నారు.

● నిందితులను పట్టించిన డ్రమ్ము

జూలై 28వ తేదీన చిన్నహోతూరు సమీపంలో ఓ డ్రమ్ములో కుళ్లిపోయిన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తు ప్రారంభించిన సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆ తర్వాత సమీప పోలీస్‌స్టేషన్‌లో ఏమైనా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయా? అని ఆరా తీశారు. ఆ రెండు, మూడు రోజుల్లో ఎలాంటి కేసు నమోదు కాలేదని సమాచారం వచ్చింది. అయితే పోలీసులు మృతదేహాన్ని ఉంచిన డ్రమ్మును నిశితంగా పరిశీలించారు. డ్రమ్ముపై 'క్లారియంట్ ఐజీఎల్ స్పెషాలిటీ కెమికల్స్' అనే లేబుల్ ఉంది. ఈ లేబుల్‌ను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే.. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీ చెందిన డ్రమ్ముగా గుర్తించారు. ఆ కంపెనీ ప్రతినిధులను ఫోన్‌లో సంప్రదించి ఆ డ్రమ్ము వివరాలు ఆరా తీశారు. ఆ డ్రమ్ములు ఎక్కడెక్కడ సరఫరా చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఆ డ్రమ్ము హిందూపురం, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్లుగా వివరించారు. ఆ తర్వాత ఆలూరు వై. జంక్షన్ సర్కిల్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ సీసీ ఫుటేజీలో పసుపు రంగులో ఉన్న ఓ ఆటో అనుమానస్పందంగా కనిపించింది. దానిపై ఉన్న నెంబరు కనిపించలేదు. అయితే ఆ ఆటోకు టైర్లు విచిత్రమైన సింబల్స్‌తో ఉన్నాయి. మరో బృందం, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, బళ్లారి ఆలూరు తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలన్నింటినీ పరిశీలించారు. అదే సమయంలో మృతదేహం లభ్యమైన ప్రాంతంలో సెల్‌టవర్ డంప్, సెల్ సిగ్నల్స్ ఆధారంగా కొన్ని అనుమానాస్పద ఫోన్ నెంబర్లను గుర్తించారు. ఇలా సెర్చ్ చేస్తున్న క్రమంలో ఆదోనిలోని సీసీ ఫుటేజీలో ఆలూరు వై.జంక్షన్ సీసీ కెమెరాలో ఉన్న ఆటోను పోలిన విచిత్రమైన సింబల్స్‌లో ఉన్న టైర్ల ఆటోను గుర్తించారు. దానిపైన ఉన్న రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా ఆటో డ్రైవర్‌ను వెతికి పట్టుకున్నారు. తనకు ఆ డ్రమ్ములో ఏముందో తెలియదు అని. ఎవరో ముగ్గురు వ్యక్తులు వచ్చి కెమికల్ డ్రమ్ము అని చెప్పి ఆ డ్రమ్మును ఊరి చివరి పడేసి రావాలని ఆటోను బాడుగకు మాట్లాడుకున్నారని డ్రైవర్ వివరించాడు. దీంతో కేసు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్‌తో మాట్లాడిన సందర్భాలు సెల్ టవర్ డంప్‌ను కూడా పరిశీలించారు. ఆటో డ్రైవర్ వివరాల మేరకు ఓ మూడు సెల్ ఫోన్ నెంబర్లు కలిగిన వ్యక్తులు హాలేబీడు, తుమ్మలబీడు, సూగూరు ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్‌సాయంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించి వారే నిందితులుగా గుర్తించారు.

● డబ్బు కోసమే హత్య



సీసీ పుటేజీలో లభ్యమైన ఆటో (ఫైల్)

ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన పేటయ్య పొలం విక్రయించాడు. దానికి సంబంధించి కొంత నగదు పేటయ్యకు వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన నరసింహులు ఆ డబ్బులను కాజేయాలని ప్రణాళిక వేసుకున్నాడు. హాలేబీడుకు చెందిన హనుమంతు, పంపన్నల సాయం కోరాడు. జూలై 24న పేటయ్యను నమ్మించి ఆలూరు దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ అందరూ కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో విషగులికలు వేసి పేటయ్యను హతమార్చారు. ఆ తర్వాత సమీపంలోని పొలం యజమాని సాయంతో పైపైనే శవాన్ని పూడ్చిపెట్టారు. రెండు రోజుల తర్వాత మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో పొలం యజమాని అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో అతనికి రూ.50వేలు ఆశ చూపి మరో రోజు సమయం తీసుకుని ఓ డ్రమ్ము తీసుకువచ్చి మృతదేహాన్ని గుంతలో నుంచి బయటకు తీసి డ్రమ్ములో వేశారు.



డ్రమ్ముల్లో మృతదేహం (ఫైల్)

జూలై 27వ తేదీ డ్రమ్మును జాగ్రత్తగా సీల్ వేసి ఓ ఆటోను మాట్లాడుకుని ఆస్పరి సమీపంలో చిన్నహోతూరు సమీపంలో ఆ డ్రమ్మును పడేసి వెళ్లిపోయారు.

● రెండు రోజుల్లో



పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహం కేసులో ఎలాంటి క్లూ లేకున్నా కూడా రెండు రోజుల్లో మా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కేసు ఛేదించడం అభినందనీయం. ఈ కేసులో నిందితులను పట్టుకున్న తర్వాత చనిపోయిన వ్యక్తి వివరాలు తెలిశాయి. సీఐ హనుమంతప్ప, సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో ప్రధాన పాత్ర వహించారు. ఈ కేసు అవార్డుకు ఎంపిక కావడం భవిష్యత్తులో మరింత బాధ్యతను పెంచుతుంది. ముున్ముందు అన్ని కేసుల్లో టెక్నాలజీని ఉపయోగించుకుని కేసులు ఛేదించేలా పూర్తి స్థాయి శిక్షణ కూడా ఇస్తున్నాం. సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటాం. ఈ కేసులో సీసీ కెమెరాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

– జి.బిందుమాధవ్, ఎస్పీ

అర్జీలను రెండు వారాల్లోపు పరిష్కరించాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు రెండు వారాల్లోపు పరిష్కారం చూపాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ సదస్సులు, హౌసింగ్, పంచాయతీ రాజ్, సీసీ రోడ్లు, పీఆర్ ఓన్ యాప్, తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు డివిజన్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 7వ తేదీన రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ, ప్రిన్సిపల్ సెక్రటరీలు రెవెన్యూ సదస్సులకు సంబంధించి తిరుపతిలో రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని, అంతలోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. రీజనల్ కాన్ఫరెన్స్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను కారణాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. జనవరి మొదటి వారంలో ముఖ్యమంత్రిచే లక్ష ఇళ్లను ప్రారంభించే కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హొళగుంద, మద్దికెర, చిప్పగిరి (యాస్పిరేషనల్ బ్లాక్స్) మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ పి. రంజిత్ బాషా జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయిల ఏర్పాటుకు ప్రత్యేక టెండరు పిలిచి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు త్వరగా పూర్తి చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఇన్‌చార్జి సీపీవో భారతి, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వర రావు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డీఈవో శామ్యూల్ పాల్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు, రాష్ట్రీయ స్వాస్థ్య కోఆర్డినేటర్ హేమలత, యాస్పిరేషనల్ బ్లాక్ కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ పెట్టండి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ, ఐఆర్‌పీల సహకారంతో వైద్య సదుపాయాలు అందించి ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాల ద్వారా శ్రద్ధ తీసుకోవాలని స్టేట్ ఐఈ కోఆర్డినేటర్ కల్పన పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏ. క్యాంపులోని ఆర్ట్ ఫౌండేషన్‌లో బడిబయట ఉన్న పిల్లల్లో ఇన్‌ఫ్యూ ఎడ్యుకేషన్‌పై మండల విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై శ్రద్ధ వహించి అవసరాలను తీర్చాలన్నారు. అవసరమైతే వారి తల్లిదండ్రులతో మాట్లాడి వైద్యసౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్ పాల్, ఐఈ కోఆర్డినేటర్ సురేష్ రాజు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆరుగురు నిర్దోషులు

- 2001 కప్పట్రాళ్ల హత్య కేసులో
- ఆరుగురు ఖైదీలను నిర్దోషులుగా హైకోర్టు తీర్పు



కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు (ఫైల్)

దేవనకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇరవై మూడేళ్ల కిందటి ఆరుగురి హత్య కేసులో ఆరుగురు నిందితులను హైకోర్టు నిర్దోషులని తీర్పు చెప్పింది. 30.10.2001 సూర్యోదయం కంటే ముందు కప్పట్రాళ్లలో బాంబుల మోత వినిపించింది. దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు పాలేగారి వెంకటప్పనాయుడుపై హత్యయత్నం జరిగింది. గ్రామపంచాయతీ సమీపంలో వున్న వెంకటప్పనాయుడు ఇంటి చుట్టుపక్కల కళావతుల శేషు, పంద్ర, కృష్ణుడు, రాజు, మరో ఇద్దరు నీళ్ల కోసం వచ్చిన్నట్లు, పనులు చేసుకుంటున్నట్లు ఉండి, తన ఇంటి ఆవరణలో వాకింగ్ చేస్తున్న వెంకటప్పనాయుడుపై బాంబులతో దాడి చేశారు. ఈ దాడిలో వెంకటప్పనాయుడు గాయాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నాయుడు అనుచరులు దాడి చేసేందుకు వచ్చిన వారిని వెంబడించి దాడి చేయడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 25 మందిపై దేవనకొండ పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. ఆదోని కోర్టులో విచారణ నిమిత్తం కప్పట్రాళ్లకు చెందిన తిమ్మలు, గువ్వల రంగన్న, బోయ రాజు, రహిమాన్, రామాంజినేయులు, నర్సప్పపై 2012లో ఆదోని కోర్టు జీవిత ఖైదీ శిక్ష విధించింది. 2012 నుండి శిక్ష అనుభవిస్తున్న ఈ ఆరుగురిని 2020లో కరోన మహమ్మరి వ్యాప్తి చెందడంతో కండీషన్ బెయిల్‌పై సొంత గ్రామాలకు పంపారు. నాటి నుండి కండీషన్ బెయిల్‌పై గ్రామంలోనే ఈ ఆరుగురు ఉంటున్నారు. 2012లో శిక్షపడిన వెంటనే ఈ ఆరుగురు హైకోర్టులో అప్పీలు చేశారు. 11 ఏళ్ల తరువాత, మూడు నెలల క్రితం హైకోర్టులో కేసు విచారణ మొదలైంది. శుక్రవారం ఆరుగురుని నిర్దోషులుగా హైకోర్టు తీర్పు ఇచ్చింది.

ఆదోని మార్కెట్ యార్డుకు సొబగులు

(5వ పేజీ తరువాయి)

వర్షపు నీరు తడవకుండా రూ.14.80 కోట్లతో కవరు షెడ్డు

పాత వేరుశనగ ప్లాట్‌ఫాం లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం వచ్చిన ప్రతిసారి ప్లాట్‌ఫాంపై రైతులు టెండర్‌లు ఉంచిన దిగుబడులన్నీ ఆ వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. ప్రధానంగా డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం ప్లాట్‌ఫాం రోడ్డుకు కంటే తక్కువ ఎత్తు ఉండడం వల్ల రైతులు వర్షపు నీరు చేరి ఆనీటిలో దిగుబడులు కొట్టుకుపోయి నష్టపోతున్నారు. ఇలా జరగకుండా దిగుబడులు రక్షణగా పూర్తిగా కవర్డ్‌షెడ్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి రూ.14.80 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆమోదం తెలిపిన రైతుకు కష్టాలు తీరినట్టే.



ప్రతిపాదించిన పనులు ఇవే...

- అదనపు డ్రైనేజీల నిర్మాణానికి రూ. 70 లక్షలు
- వేరుశనగ యార్డు దుకాణాల ముందు షట్టర్లకు గట్టర్లకు ఏర్పాటు చేసి నీరు బయటకు వెళ్లేందుకు రూ.20 లక్షలు
- మార్కెట్ యార్ట్ అంతా అన్ని ప్లాట్‌ఫాంలలో ఉన్న రైతుకు తాగు నీరు ఇబ్బందులు పడకుండా తాగునీటి సరఫరాకు రూ.10 లక్షలు
- అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు
- పాత యార్డులో దిగుబడుల వర్షపు నీటి రక్షణగా రూ.14.80 కోట్లు కవర్డ్ షెడ్ నిర్మాణం
- కార్యాలయ భవన సముదాయ నిర్మాణానికి రూ.5 కోట్లు
- రైతు విశ్రాంతి భవనం నిర్మాణానికి రూ. 25లక్షలు
- మొత్తం అన్ని పనులకు రూ.21.40 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు తయారు చేసి పంపారు.

● మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి



ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. మార్కెట్ యార్డు కొచ్చిన రైతులకు తూకాలు, క్రయవిక్రయాలు, చెల్లింపులోనూ పారదర్శకత ఉంటుందన్న నమ్మకం. అలాంటి వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. తాగునీరు దగ్గర సదుపాయాలన్నీ కల్పిస్తాం.

-రామ్మోహన్ రెడ్డి, ఎంపిక కార్యదర్శి మార్కెట్ యార్డు, ఆదోని

● మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆమోదం తెలిపిన వెంటనే పనులు



రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు మార్కెట్ యార్డ్‌లో మౌలిక వసతులు కల్పనకు రూ. 20.48 కోట్లు అవసరమవుతుందని ప్రతిపాదనలు వివేదికను అందజేశాం. కమిషనర్ మార్కెట్ యార్డులో పర్యటించి అవపరాలను గుర్తించారు. ప్రతిపాదనలకు నిధులు కేటాయించిన వెంటనే టెండర్‌లను పిలిచి పనులు చేపడతాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలన్నీ కల్పిస్తాం.

- సుబ్బారెడ్డి, డీఈ, ఆదోని

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి: మంత్రి టీజీ


మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని సి.క్యాంపు టీజీవీ కళాక్షేత్రం షాపింగ్ కాంప్లెక్స్‌లోగల కృష్ణా స్వీట్స్ షాపులో అదనంగా 'క్రీమ్' పేరుతో బేకరీ విభాగాన్ని మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కృష్ణా స్వీట్స్ మిఠాయిల అమ్మకాల్లో తనదైన గుర్తింపు తెచ్చుకుందని, క్రీమ్స్ విభాగం కూడా అదేస్థాయిలో నిలుస్తుం దని చెప్పారు. కృష్ణా స్వీట్స్ అధినేత కొండా వినయ్ మాట్లాడుతూ అన్ని పుట్టిన రోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు, ఇతరత్రా శుభకార్యాల సమయంలో వినియోగదారులు కోరుకున్న రుచుల్లో, డిజైన్లలో కేక్‌లు, ఇతర బేకరీ ఐటమ్స్ లభిస్తాయని తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో 261 అర్జీలు స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శుక్రవారం 24 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులలో 261 అర్జీలను స్వీకరించామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని కులుమాల గ్రామంలో 20, నంద వరం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో 3, ఎమ్మిగనూరు మండలంలోని కే.తిమ్మాపురంలో 5, కోసిగి మండలంలోని బి.బొమ్మలాపురంలో 11, మంత్రాలయం మండలంలోని వి.తిమ్మాపురంలో 9, పెద్దకడుబూరు మండలంలోని హాలికల్వ గ్రామంలో 4, ఆదోని మండలంలోని నరసా పురం గ్రామంలో 19, చాగి గ్రామంలో 15, కౌతాళం మండలంలోని ఎరి గేరిలో 20, హోళగుంద మండలంలోని సమతగేరి గ్రామంలో 13, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలో గుట్టపాడు గ్రామంలో 27, కల్లూరు మండలంలోని నాయకల్లులో 11, వెల్దుర్తి మండ లంలోని నరసాపురంలో 10, కోడుమూరు మండలంలోని వర్కూరు గ్రామంలో 9, కర్నూలు రూరల్‌లోని మునగాలపాడు గ్రామంలో 15, గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో 8, సి.బెళగల్ మండలం లోని బురాన్‌దొడ్డి గ్రామంలో 6, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో 15, క్రిష్ణగిరి మండలంలోని హాలంకొండ గ్రామంలో 7, ఆలూరు మండలంలోని ముద్దనగేరి గ్రామంలో 15, చిప్పగిరి మండలంలోని తిమ్మాపురంలో 12, ఆస్పరి మండలంలోని హాలిగేరిలో 4, హాలహర్వి మండలం అర్ధనగేరి గ్రామంలో 3, దేవనకొండ మండలం లోని పొట్లపాడులో 1 అర్జీలు వచ్చాయన్నారు.

ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై పోలీసులు డ్రోన్‌తో కొరడా ఝుళిపించారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండు, రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద, ఉల్చాల రోడ్డు, పరిసర ప్రాంతాల్లో బహిరంగ మద్యం, చట్ట వ్యతిరేక కార్యక లాపాలపై ఫోర్త్ టౌన్ పోలీసులు సంయుక్తంగా డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ రామమునయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏ.క్యాంపులోని షైపర్ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ అబ్యూస్, సైబర్ నేరాల నియంత్రణ, మహిళలపై లైంగిక వేధింపులు, మహిళలు, బాలికల అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, తదితర అంశాలపై అవగాహన సదస్సులు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్ బాషా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సీఐ రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ సెట్కూరు సీఈవో దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కర్నూలు రేంజ్ డీఐజీ

కర్నూలు క్రైం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో రైమ్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం డీఐజీ కార్యాలయంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ అకాడమి విద్యార్థులను ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రపంచ స్థాయి అబాకస్ మెంటల్ అర్థమెటిక్ పోటీల్లో 30 పైగా దేశాల నుంచి 6వేలమందిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. కర్నూలు రైమ్స్ అకాడమీకి చెందిన 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 32 మంది ప్రతిభ కనబరిచారు. 6 మంది చాంపియన్లు, 8 మంది ఫస్ట్ రన్నరప్, నలుగురు సెకండ్ రన్నరప్, 12 మంది థర్డ్ రన్నరప్, ఇద్దరు ఫోర్త్ రన్నరప్‌గా నిలిచారు. ఢిల్లీ వేదికలో ఈ ట్రోఫీలను సాధించారని రైమ్స్ అకాడమి డైరెక్టర్ రూప తెలిపారు. కార్యక్రమంలో రైమ్స్ అకాడమీ డైరెక్టర్ రూప, అధ్యాపకులు, యమున, జయశ్రీ, భార్గవి, అర్షియా, మౌనిక పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏపీ జట్టు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం లోని దిండిగల్‌లో ఈనెల 23 నుంచి 27 వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు ప్రకటించారు. శుక్రవారం స్థానిక ఆదర్శ విద్యామందిర్ జూనియర్ కళశాల డైరెక్టర్ డా.హరికృష్ణ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం జట్టు ను ప్రకటించారు. సీహెచ్ దేవిక, జి.దేవి, పుష్ప, సీహెచ్ గాయత్రీ, వెంకటలక్ష్మి, ఝాన్సీ, రిషిత, జ్యోతి, హన్సిక, అనన్య, త్రివిధ, లక్ష్మి, శ్రీవాణి, షాహీదా, అలాగే జట్టు కోచ్‌గా వెంకటేశ్, మేనేజర్‌గా పుణ్యవతిలు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

సమ్మె విరమణ.. విధులకు హాజరు

గూడూరు డిసెంబరు 20: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత పది రోజులుగా నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించి విధులకు హాజరైనట్లు అధ్యక్షుడు అరవింద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సీడీఎంఏ కార్యాలయంలో అన్ని యూనియన్ల నాయకులతో చర్చలు జరిపారన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించి డిమాండ్లను మున్సిపల్ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి మరోసారి సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్ తెలిపారన్నారు. ఈ సమావేశంలో దూకేశ్వరరావు, బసవ రాజు, మధు, షబ్బీర్ బాషా, పఠాన్, ఖాజా హుసేన్, అల్లి బాషా, జయన్న, ఆంజనేయులు, ప్రభాకర్, రజాక్ పాల్గొన్నారు.

పప్పు శనగకు పచ్చ పురుగు

ఆందోళనలో రైతులు

ఓర్వకల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): శనగ పంటకు మొగలి మంచుతోపాటు పచ్చపురుగు తెగుళ్లు సోకింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో మండలంలో అత్యధికంగా పంటలు సాగు చేశారు. ఎకరాకు రూ.వేలల్లో పెట్టుబడి పెట్టినా కళ్లెదుటే పూత రాలిపోతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విదంగా మొగలి మంచు, పచ్చపురుగు ఈ ఏడాది అధికంగా సోకింది. మండలంలోని కన్నమడకల, ఓర్వకల్లు, పూడిచెర్ల, తిప్పాయపల్లె, హుశేనాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, మీదివేముల తదితర గ్రామాల్లో 5000 ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. అలాగే పచ్చ పురుగు దెబ్బతో మొక్కలు కూడా ఎండిపోతు న్నాయి. గత ఏడాది ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది 6 నుంచి 7 క్వింటాళ్లు దిగుబడి వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి పెట్టారు. ఎకరా కౌలుకు రూ.10వేలు చెల్లించారు. గత మూడేళ్ల నుంచి దిగుబడి అంతంత మాత్రం గానే వచ్చిందని గిట్టుబాటు ధర కూడా లేదన్నారు. అలాగే గత ఏడాది మద్దతు ధర లేకపోవడంతో ఇప్పటికి గోదాముల్లోనే శనగలు నిల్వ ఉంచారు. ఈ ఏడాది కూడా ధర అంతంతంగా మాత్రంగానే ఉంటుందని, పంటపై చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు ఆందోళన చెందుతు న్నారు. ప్రభుత్వం స్పందించి మద్దితు ధర రూ.8వేలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.


గుట్టపాడులో సాగు చేసిన శనగ పంటను చూపుతున్న రైతు

తీవ్రంగా నష్టపోతున్నాం



ఏడు ఎకరాలను కౌలుకు తీసుకున్నా. ముందే రూ.లక్ష చెల్లించాను. పెట్టుబడి రూ.లక్ష దాకా పెట్టాను. ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పంట సాగు చేసి 75 రోజులు కావస్తుంది. కాయలు కనిపించడం లేదు. ఉన్న పూత కూడా మొగలి మంచుతో రాలిపోతుంది. మార్కెట్‌లో కూడా ధర లేదు.

– పాల మధుమోహన్, రైతు, హుశేనాపురం

మద్దతు ధర ప్రకటించాలి



మండలంలో 5 వేల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. అయితే తెగుళ్ల, మంచు ప్రభావంతో పంట దిగుబడి తగ్గుతోంది. ప్రభుత్వం మద్దతు ధర క్వింటం రూ.8వేలు ప్రకటించాలి. గత మూడేళ్ల నుంచి ధర లేక తీవ్రంగా నష్టపోయాం. మద్దతు ధర కల్పిస్తే అప్పుల నుంచి బయట పడుతాం.

– ఆదాంబాషా, రైతు, ఓర్వకల్లు

గంగమ్మ చెరువును కాపాడండి

కర్నూలు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలంలోని బి.తాండ్రపాడు గ్రామ పరిధిలో ఆక్రమణకు గురైన గంగమ్మ చెరువును కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, షేక్ అన్వర్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు మండలంలో బి.తాండ్రపాడులో అక్రమణకు గురైన ప్రభుత్వ చెరువులు, స్థలాలను శుక్రవారం పట్టణ పౌరుల సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ నగరం చుట్టు ఉన్న ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, చెరువులు కనుమరుగుయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన మాటపై నిలిచి సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. కొంతమంది రెవెన్యూ అధికారులు వాస్తవాలను ప్రజలకు తెలియకుండా దాస్తున్నారని తద్వారా పైస్థాయి అధికారలుకు తపుడు నివేదికలు ఇస్తున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు రూరల్ మండలంలో పనిచేసిన ఓ తహసీల్దార్ హయాంలోనే ఇలాంటి విలువైన ప్రభుత్వ భూములు అన్యక్రాంతమయ్యాయని వారు ఆరోపించారు. అప్పటి వైసీపీ ప్రజాప్రతి నిధులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మధ్య వర్తిత్వం వహించి రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి వెంట కాలనీ ప్రతిని, దులు శ్రీనివాసులు, వర్మ, మద్దిలేటి, నాగేంద్ర, విజయ్, మధు ఉన్నారు.


ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న నాయకులు

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

కర్నూలు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎంపీడీవో కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఇటీవల విడుదలైన పలురకాల ప్రభుత్వ నిధుల వివరాలను ఎంపీడీవో రఘునాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని నందనపల్లె గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ సర్వేల గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని పరిశీలించి, సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్య దర్శి శ్రీనివాసనాయక్‌ను ఆదేశించారు. జడ్పీ సీఈవో వెంట ఎంపీడీవో రఘునాథ్, ఈవోఆర్డీ అనూరాధ ఉన్నారు.

ఆర్టీసీ బస్సుల కండీషన్‌లో నిర్లక్ష్యం వద్దు

కర్నూలు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల కండీషన్ల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని కర్నూలు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ హరిబాబు డిపో గ్యారేజీ మెకానికల్‌ను ఆదేశించారు. కర్నూలు-1డిపో గ్యారేజిలో శుక్రవారం ఆయన బస్సుల పనితీరును పరిశీలించారు. బస్సు సర్వీసు వివరాలను డిపో మేనేజర్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. బస్సుల కండిషన్‌లో ఏమాత్రం నిర్లక్ష్యం వహిం చిన చర్యలు తీసుకుంటామన్నారు. డిపోల పరిధిలో బస్సుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డిపో ఉద్యోగులు, మెకానిక్‌లు ఉన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. శుక్రవారం నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథం, విరుపాక్షి రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోండి

సి.బెళగల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలంతా సభ్యత్వం తీసుకోవాలని మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పోలకల్లు లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకోవడం వలన రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. రూ.5లక్షల బీమా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సాధారణంగా మృతి చెందినవారి రూ 2 లక్షలు అందజేస్తుందన్నారు. ఈ అవకాశం ఈనెల 26 తేదీ వరకే అన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలి

సి.బెళగల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపురం గ్రామంలో రబీలో రైతులు సాగు చేసిన వరి, మినుములు, సజ్జ, కొర్ర పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల సాగును అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో మల్లేష్‌కుమార్, శాస్త్రవేత్తలు హిమ బిందు, ఎంపీఈవోలు నాయక్, నాగన్న, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి: ఎస్ఎఫ్ఐ

కర్నూలు అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వాదులకు అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎస్ఎఫ్ఐ వర్సిటీ కన్వీనర్ రామక్రిష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్ అవమానించడమంటే భాతర రాజ్యాంగాన్ని అవమానించడమే అని అన్నారు. ఎస్ఎఫ్ఐ కో కన్వీనర్ మౌలాలీ, రాజు, భరత్ అనిల్, ప్రతాప్, గణేష్, శివ పాల్గొన్నారు.

పొదుపు మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

సి.బెళగల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు పారిశ్రా మిక వేత్తలుగా ఎదగాలని కొత్తకోట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనే జర్ అమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజర్ అమిత్‌కుమార్ మాట్లాడుతూ పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఎంపీఎం రమేష్, సీసీలు రాముడు, బాషా, మధు, గుండమయ్య, గోవిందు బుక్‌కీపర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న చీరలు అప్పగింత

కర్నూలు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వాతి అనే మహిళ తమ చీరలను ఆటోలో మరిచిపోగా.. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా ఆ చీరలను గుర్తించారు. ఈ నెల 18న స్వాతి అనే మహిళ పాతబస్తీలో సుమారు రూ.40వేలు విలువ గల చీరలు కొనుగోలు చేసి ఆటో ఎక్కింది. తిరిగి రెవెన్యూ కాలనీలో ఆటో దిగి చీరలు ఆటోలోనే మరిచిపోయి వెళ్లిపోయింది. ఆ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కానిస్టేబుళ్లు షేక్షావలి, ఆంజనేయులు సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించి చీరలను తెప్పించారు. ఆ చీరలను బాధితురాలికి సీఐ రామయ్యానాయుడు సమక్షంలో అప్పగించారు.

నెట్ బాల్ పోటీల్లో రాణించాలి


క్రీడాకారులకు టీషర్టులను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంటులో జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకుడు నాగరత్నమయ్య అన్నారు. స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా నెట్‌బాల్ క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరత్నమయ్య మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాజకీయ వ్యూహకర్త నాగేశ్వర బాబు, నెట్‌బాల్ చైర్మన్ ఆనందరావు, కార్యదర్శి వంశీకృష్ణ, కోచ్‌లు రాజశేఖర్, శుభాన్, సుప్రియ, గీతామాధురి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరిస్తాం: తహసీల్దార్

ఓర్వకల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని గుట్టపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గ్రామ సర్పంచ్ నర్ల మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రైతుల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీరా ములు, రాజన్న, జయన్న, నరసింహరాజు, లక్ష్మన్న, రాముడు, మద్దిలేటి పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఏడీఏ సాలురెడ్డి, తహసీ ల్దార్ వెంకటేశ్‌నాయక్ సూచించారు. శుక్రవారం వర్కూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదులను 45 రోజుల్లోగా పరిష్కారం చూపుతామన్నారు. ఎల్పీమ్ సమస్యలపై 11 మంది రైతులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

గూడూరు: రెవెన్యూ సదస్సులను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలం లోని గుడిపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా తహసీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ఏడు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ రెడ్డి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వర రెడ్డి, సర్వేయర్ బాలు నాయక్, ఆర్ఐ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.


గుట్టపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

వేగాన్ని నియంత్రించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రహదారుల్లో అధిక వేగంతో వెళ్లడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వేగాన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్ట రేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవం బరు నెలలో 57 ప్రమాదాలు జరుగగా, అందులో 34 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, త్వరితగతిన రోడ్డు మరమ్మతులు పనులు పూర్తి చేయాలని, గుంతలను పూడ్చాలని ఆర్ అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. పెద్దపాడు నుంచి హైదరాబాదు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ రోడ్డు ఏర్పాటుకు సర్వే చేసి తగిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. నంద్యాల, నందికొట్కూరు, కడప వైపు వెళ్లే బస్సుల్లో కొన్ని బస్సులను రాజ్‌విహార్ సర్కిల్ డిపో నుంచి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్పీ (అడ్మిన్) హుసేన్‌పీరా, డీటీసీ శాంతకుమారి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఆర్డీవో లాల్‌సింగ్ చౌహాన్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సరిహద్దుల్లో శంభూ బార్డర్ వద్ద రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా 23న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దంబోలం శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గత వారం రోజులుగా బైఠా యించారని, గిట్టుబాటు ధరను చట్టబద్ధత చేయాలన్నారు. ఈ ఉద్యమానికి సంయుక్త కిసాన్ మోర్చా మద్దతు తెలియజేస్తుందన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో జరిగిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీల్లో కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో ఖో-ఖో పోటీల్లో ప్రథమ స్థానం, బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నర్స్, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారు. బాలుర విభాగంలో బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ప్రథమ స్థానం, జావెలింగ్ త్రోలో తృతీయ స్థానం సాధించారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ విజయలక్ష్మి అభినందించారు. ప్రిన్సిపాల్ విజయ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహులు, రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో వండర్ కార్నివాల్


కార్నివాల్ ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏ.క్యాంపు మాంటి స్సోరి పాఠశాలలో శుక్రవారం వండర్ కార్నివాల్ ఘనంగా నిర్వహించారు. హైకిడ్స్ విభాగం చెందిన విద్యార్థులు పాల్గొని ఏరోబిక్స్, డ్రిల్, జింగిల్ బెల్ వివిధ జాతులకు సంబంధించిన వేషధారణలతో నృత్యాలు ప్రద ర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గాయనీ రాజశేఖర్ మాట్లా డుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో రాధా రాణి, శశి కళ, రమాజ్యోతి, కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాంటును బలోపేతం చేయండి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి మేలు చేకూర్చే సీఏడీడబ్ల్యూ రీసైక్లింగ్ ప్లాంట్‌ను మరింత బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం 19వ వార్డు జొహరాపురం రహదారి వద్దద డంప్ యార్డులోని కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలిషన్ వేస్టేజ్(సీఏడిడబ్ల్యూ) రీసైక్లింగ్ ప్లాంటును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పేరుకుపోతున్న భవన నిర్మాణ, కూల్చివేత వంటి నిర్మాణ రంగ వ్యర్థాలను కొత్త రూపంలో పునర్వి నియోగించుకోవ చ్చని అన్నారు. దీనిని శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేసి పునర్వినియోగం చేసుకునేలా మెటీరియల్ తయారు చేస్తారని అన్నారు. దీని ద్వారా సహ జ వనరుల వినియోగం తగ్గి పర్యావరణానికి ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గంగాధర్, ఏఈ వైష్ణవి, సూపర్‌వైజర్ జగదీష్, టీపీఎస్ అంజాద్ బాషా పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగర పాలకకు చెందిన క్రీడా ప్రాంగణాలను లీజుదారులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఆదేశించారు. శుక్రవారం 19వ వార్డు జొహరాపురం రహదారి పక్కన ఉన్న ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ రింక్ లను ఆయన పరిశీలించారు. వాటి పన్ను, లీజు బకాయిలపై ఆరా తీశారు. సకాలంలో నగర పాలకకు పన్ను, లీజు రుసుంలు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఓ జునైద్, ఆర్ఐ భార్గవ్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, లైబ్రేరియన్ల నియామకం

కర్నూలు అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌గా జయలక్ష్మి, లైబ్రేరియన్‌గా మద్దయ్య లను నియమించినట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీలో 3 గ్రంథాలయాలను ఆధునీ కరించాలని, ఎన్ఎస్ఎస్ 7 యూనిట్లను బలోపేతం చేయాలని అన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కర్నూలు క్రైం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గోనెగండ్ల గ్రామానికి చెందిన రాజు కుమార్(29) అనే యువ రైతు చికిత్స పొందుతూ మృతి చెందారు. రాజుకుమార్ వ్యవసాయంలో సుమారు రూ.6 లక్షలు అప్పు చేశారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తాళలేక పది రోజుల క్రితం భార్య పిల్లలతో కలిసి కర్నూలులోని గీతానగర్‌కు వచ్చి తన సోదరుడు నాగరాజు ఇంట్లో ఉంటూ హమాలీ పనికి వెళుతున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో ఈ నెల 16వ తేదీన పురుగు ల మందు తాగాడు. బంధువులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. భార్య సునీతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన



శుభ్రతను పరిశీలిస్తున్న కమిషనర్

ఆదోని టౌన్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్నక్యాంటిన్లను మున్సిపల్ కమిషనర్ కృష్ణ శుక్రవారం పరిశీలించారు. క్యాంటిన్లలో శుభ్రతను ఏమాత్రం పాటిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆహార పదార్థాలు వృథా కాకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందిని సూచించారు.

కుల వివక్ష చూపే వారిపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఆదోని రూరల్ డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం జి.హొసళ్ళిలో దళితుల పట్ల కొందరు కులవివక్షత చూపుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామ దళితులతో కలిసి కేవీపీఎస్ నాయకులు డిఎస్పీ సోమన్న, తహసీల్దార్ శివరాముడు, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 72 సంవత్సరాల భారతదేశంలో నేటికి దళితులు కుల వివక్షతకు గురవుతున్నారన్నారు. జి.హొసళ్లిలో 24,25వ తేదీల్లో జరిగే దేవర ఉత్సవాల్లో దళితులను దూరం పెట్టేందుకు గ్రామ పెద్దలు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మన్న, వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించండి

ఆదోని టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాను మున్సిపాలిటీకి రూ. రెండు లక్షల ఆస్తి పన్ను బకాయి ఉన్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి కౌన్సిల్ సమావేశంలో ఆరోపించడంలో ఎలాంటి నిజం లేదని, బకాయి ఉన్నట్లు నిరూపించాలని, లేనిపక్షంలో తనకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీనియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనవసరంగా ఇతర నాయకులపై ఎమ్మెల్యే ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకా మాట్లాడుతూ, ఇతర పార్టీల నాయకులపై అనవసరంగా విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి, దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్ పాల్గొన్నారు.

డివైడర్‌ను తప్పించబోయి ఒరిగిన లారీ

● తప్పిన ప్రమాదం

ఆలూరు, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక నుంచి హైదరాబాద్ వైపు క్యాబేజి లోడ్‌తో వెళ్తున్న లారీ శుక్రవారం తెల్లవారుజామున ఆలూరు పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద డివైడర్‌ను తప్పించబోయి, అదుపు తప్పి ఒరిగిపోయింది.. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆలూరు-బళ్ళారిప్రధాన రహదారి కావడంతో వాహన రాకపోకలకు కొద్దిమేర ఇబ్బంది ఏర్పడింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం



వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో ప్రభుత్వ వైద్యశాల సమీపంలో వైసీపీ కార్యాలయాన్ని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో పూజలు చేసి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెల్దుర్తి ఎంపీపీ రంగయ్య, కృష్ణగిరి ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ ముత్యాల శైలజ, మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, బొమ్మన పెద్దిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సమీర్‌కుమార్ రెడ్డి, శరభారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీరామరెడ్డి, సుంకిరెడ్డి, కమలాకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

దేవనకొండ, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 9వ మహాసభ నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.మండల అధ్యక్షులుగా రామంజినేయులు,కార్యదర్శిగా రవికుమార్,నరేష్,రమేష్,నరసింహులు,భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘతంతో పశుగ్రాసం దగ్ధం

దేవనకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పొలంలో వున్న పశుగ్రాసాన్ని(వరిగడ్డి) గ్రామానికి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించడంతో పశుగ్రాసం దగ్ధమైంది. మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన నెల్లూరి శంకర్ అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా విద్యుదాఘతంతో మంటల చేలరేగి రూ.15 వేల విలువ చేసే పశుగ్రాసం దగ్ధం కావడంతో ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రశాంతంగా వేలం

మద్దికెర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి ఆలయంలో తమలపాకులు, టెంకాయలు అమ్ముకోవడానికి నిర్వహించిన వేలం పాటలు జరిగాయి. శుక్రవారం ఏడాదిపాటు టెంకాయలు, తమలపాకులు అమ్ముకోవడానికి బహిరంగ వేలాన్ని గతంలో రెండుసార్లు నిర్వహించగా వాయిదా పడ్డాయి. శుక్రవారం మూడోసారి పర్యవేక్షణాధికారి వెంకటనరసయ్య, ఆలయ ఈవో వీరయ్య ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించగా.. గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి రూ.8.25లక్షలకు పాట పాడి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

వైభవంగా దుర్గమ్మ పూజలు

మద్దికెర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ దేవత మద్దమ్మ దేవాలయంలో భవానీ మాలాదారులు విజయవాడ దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం మూలవిరాట్ మద్దమ్మవ్వతోపాటు విజయవాడ దుర్గమ్మకు భవానీ మాలాదారులు గురుస్వాములు శ్రీనివాసులశెట్టి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్లోకాలు పఠించారు. సాయంత్రం 101 మంది చిన్నారులు కలశాలతో అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు.



నలకదొడ్డిలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



గోమాతకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

పత్తికొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని నలకదొడ్డి గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని, 10గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. గ్రామానికి చేరకున్న ఎమ్మెల్యేకు మాజీసర్పంచ్ బత్తినలోక్‌నాథ్ పూలమాలతో స్వాగతం పలికి, ఎద్దులబండిపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ గ్రామాలను అన్ని రకాలుగా అబివృద్ధి చేయాలన్న కోణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ ప్రత్యేకప్రణాళికలతో ముందుకుసాగుతున్నారన్నారు. ప్రతిగ్రామంలో ఇంటింటికి కొళాయి పథకం అమలుచేయడంతో పాటు చిన్నసందులోకూడా మట్టిదారి కనిపించకుండా సీసీరహదారులు నిర్మిస్తామన్నారు. గాజులదిన్నెప్రాజెక్టు ద్వారా పత్తికొండ ప్రాంతానికి తాగునీటిని సరఫరాచేసేందుకు గతంలో ఏర్పాటుచేసిన బండగట్టుపథకం నీరు ప్రస్తుతం దూదేకొండ గ్రామం వరకే అందుతున్నాయని ఆపైప్‌లైన్‌ను నలకదొడ్డివరకు పొడిగించి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిని కుబేర్నాద్, హోటల్ శ్రీనివాసులు, జూటూరు ఈశ్వరప్ప, రాజారెడ్డి, బత్తినిరాజశేఖర్, ఎంపిడీవో సువర్ణలత,, పీఆర్ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మట్టి రోడ్లు లేకుండా చూస్తా

తుగ్గలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గుంతలు, మట్టి రోడ్లు లేకుండా చేస్తానని, టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, పశుసంపద పెంచి రైతుల అభివృద్ధి చేయడమే గోకులాల షెడ్లు ముఖ్యలక్ష్యమని ప్రతి ఒక్క రైతు షెడ్ల నిర్మాణానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పగిడిరాయిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను, గోకులాల షెడ్లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 72 గోకులాల షెడ్లు మంజూరు అయ్యాయని, భవిష్యత్తులో మరిన్ని షెడ్లు మంజూరు కానున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఫక్కీరప్ప, ఏపీవో హేమసుందర్, టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, ఈశ్వర్ రెడ్డి, తిమ్మయ్య చౌదరి, తిరుపాల్ నాయుడు, శివరాముడు చౌదరి, చక్రపాణి, వెంకట్రాముడు చౌదరి, నక్కల రమేష్, వెంకటస్వామి, మిద్దె వెంకటేశ్ యాదవ్, గుండమయ్య, డీలర్ సుంకన్న, రాము, వెంకట్రాముడు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం వపగిడిరాయిలో ఆయన పర్యటించి గ్రామంలో ఉన్న పురాతన బావిని పరిశీలించారు. అలాగే ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే మా దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో ఉన్న పురాతన బావిని ఎన్ఆర్ఈజీఎస్ కింద మరమ్మతులు చేపట్టి గ్రామానికి తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు తుగ్గలి నాగేంద్ర, ఈశ్వర్ రెడ్డి, మనోహర్ చౌదరి, మిద్దె వెంకటేశ్ యాదవ్, నక్కల రమేష్, బలరాముడు, సత్యప్రకాష్, ఫక్కీరప్ప, ఓబులేసు, రంగారెడ్డి, శివ ఉన్నారు.

కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి

● మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది

ఆలూరు, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను కించపరిచే విధంగా వాఖ్యలు చేయడం తగదని, తక్షణమే కేంద్ర హోంమంత్రి పై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహనంది డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో అమిత్‌షాను కేంద్ర హోంశాఖ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా ఉన్నాయన్నారు. రాజ్యాంగాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా మాటలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ కోరాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలూరు తాలూకా కన్వీనర్ భరత్, హొళగుంద మండల కన్వీనర్ మల్లికార్జున, యూత్ కన్వీనర్ వెంకట్ రాముడు, రామాంజినేయులు మల్లికార్జున, పరమేష్, వెంకటేష్, రాజు, సూరి, నాగేంద్ర, మల్లేష్, ధనుంజయ, రాజప్ప, యాదగిరి, లోకేష్ పాల్గొన్నారు.



ఆలూరులో ధర్నా చేస్తున్న నాయకులు

దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

ఆదోని రూరల్ డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో అమీత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా భీమాస్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. గిడ్డయ్య మాట్లాడుతూ అంబేద్కర్ పట్ల అమిత్‌షా మాట్లాడిన తీరు దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి, మంత్రిపదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అజయ్ బాబు, లక్ష్మీరెడ్డి, గోపాల్, విజయ్, లక్ష్మీ నారాయణ, లింగప్ప, సుదర్శన్ పాల్గొన్నారు.



భీమాస్ కూడలి వద్ద ఆందోళన చేపడుతున్న సీపీఐ

నష్టపోయాం..

● ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం
● శాస్త్రవేత్తలతో మొరపెట్టుకుంటున్న రైతులు

మద్దికెర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పప్పు శనగకు ఎండుతెగుళ్ల సోకడంతో పంట దిగుబడి తగ్గిందని, ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామంలో పప్పుశనగ పంటను పరిశీలించడానికి కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి సమన్వయకర్త శాస్త్రవేత్త కే.రాఘవేంద్రచౌదరి, పంట సస్యరక్షణ శాస్త్రవేత్త మౌనిక వచ్చారు. ఈ సందర్భంగా రైతులు వారితో మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి పప్పుశనగ పంట ఎండిపోయి చనిపోతుందని తెలిపారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చే విధంగా చూడాలని కోరారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి నంద్యాల రకానికి చెందిన విత్తనాలు సాగు చేసుకోవాలని అన్నారు. రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల తెగుళ్లను నివారించవచ్చన్నారు. పప్పుశనగ పంటకు ఎండుతెగుళ్ల సంబంధించి పరిశీలిస్తామన్నారు. తెగుళ్ల నివారణకు ఎకరాకు 2 కిలోలు ట్రైకోడెర్మినేటర్ సురోమోనాస్ మందులను వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి యు.రవి, రైతులు మోహన్ ఉన్నారు.



శాస్త్రవేత్తలకు ఎండిపోయిన పప్పుశనగ పంట చూపుతున్న రైతులు

విద్యార్థులకు మంచి ఆహారం అందించాలి

మద్దికెర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో రంగస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఆయన పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని మొత్తం 29 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలవుతుందన్నారు. చిన్నారులకు చదువుతో పాటు మంచి భోజనం కూడా అందించాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతిలో మొత్తం 36 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారనీ, వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఉపాధ్యాయులు బోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రతిభ కనబరచాలి



విద్యార్థులను అభినందిస్తున్న జ్యోతిరెడ్డి

మద్దికెర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థినులు అన్ని రంగాల్లో ప్రతిభ సాధిస్తేనే ప్రయోజకులు అవుతారని ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఉషారాణి, గాయత్రీ ఏపీ బీసీ సంక్షేమ ప్రతినిధులు నిర్వహించిన ప్రతిభ పోటీల్లో అత్యధిక మార్కులు సాధించడంతో ఆ సంఘం ప్రతినిధులు ఆ విద్యార్థినులకు ప్రశంసాపత్రాలతో పాటు మెడల్స్‌ను బహూకరించడంతోపాటు ప్రిన్సిపల్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

తారుమారైన పొలాల రికార్డులను సరి చేయండి



జొన్నగిరిలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

తుగ్గలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనుభవంలో ఉన్న పొలం కాకుండా మరో పొలాన్ని రికార్డు చేయడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామనీ ఆ సమస్యలు పరిష్కరించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జొన్నగిరిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల చేత అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన రైతులు అనుభవంలో ఉన్న పొలం కాకుండా మరో పొలాన్ని ఆన్‌లైన్ చేయడం వల్ల ఇరువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే చుక్కల భూములను తొలగించి పట్టా అందించాలన్నారు. రికార్డులు ఉన్న ఇప్పటి వరకు కొన్ని పొలాలకు ఆన్‌లైన్ కూడా కావడం లేదని, వాటన్నింటినీ సరి చేయాలని రైతులు కోరగా.. స్పందించిన తహసీల్దార్ రమాదేవి అర్జీలు ఇచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు కాశీరంగస్వామి, అనంతస్వరూప్, టీడీపీ నాయకులు బాలన్న, మిద్దె రవికుమార్, నాగరాజు, సంగాల కృష్ణ, ఫారెస్టు ఆఫీసర్లు లక్ష్మన్న, పాల్గొన్నారు.

నరసాపురంలో రెవెన్యూ సదస్సు

వెల్దుర్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో నరసాపురం గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖరవర్మ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ హేమంత్‌రెడ్డి, వీఆర్వో మౌలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి

ఆస్పరి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : భారత కమూనిస్టు పార్టీ ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 26వ తేదీతో భారత గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో సీపీఐ పథకావిష్కరణలు, సభలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హనుమంతు, చంద్రశేఖర్, హరి, రామకృష్ణ, మల్లికార్జున, పాండు, రామయ్య, కృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు

ఆస్పరి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోహరాపురం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు తెలిపారు. శుక్రవారం గ్రామంలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అవసరం ఉన్న చోట నూతన పైపులైనులు నిర్మించి గ్రామంలో ప్రతి ఒక్కరికి తాగునీరు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం అవుతుండడంతో కూటమి నాయకులు ఉచ్చీరప్ప యాదవ్, సాలే సాహెబ్, కరుణాకర, దశరథుడు, గురుస్వామి హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ఆర్ లేబర్ కాలని పురపాలక ఉన్నత పాఠశాలలో పట్టణ అధ్యక్షుడు రవి అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ అమలు చేయాల్సిన గడువు ఇప్పటికే 19 నెలలు గడిపోయింది అన్నారు. కనీసం పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి అన్నారు. పాఠశాలలో రోజురోజుకు పెరగుతున్న బోధనేతర పనుల భారాన్ని తగ్గిస్తామని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమా, గురురాజా, మధుసూదన్‌రావు, వెంకట్రామిరెడ్డి, విజయ్, జయరాము, శ్రీరాములు, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు జూనియర్ బాలబాలికల రాష్ట్ర కబడ్డీ జట్టు సెలక్షన్స్

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : అవుట్‌డోర్ స్టేడియంలో ఆదివారం 50వ జూనియర్ బాలబాలికల రాష్ట్ర కబడ్డీ జట్టు క్రీడాకారుల సెలక్షన్స్ ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయ అమర్ ప్రకా ష్ తెలిపారు. 2005 జనవరి 12 తర్వాత జన్మించిన వారై ఉండాలని, బాలురు 70 కేజీలలోపు బరువు కలిగి, 20సంవత్సరాలలోపు ఉండాలని సూచించారు. మూడో తేదీ నుంచి గ్రౌండ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 9701012329, 9849141547లను సంప్రదించవచ్చు అన్నారు.

ఘనంగా ముందస్తు కిస్మస్ వేడుకలు

● హాజరైన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ జాన్స్ స్కూల్ ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఆలూరు యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ముఖ్యప్రసంగీకులు ఆదోని మహిమ చర్చ్ వ్యవస్థాపకులు రవి ప్రకాష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ లోకంలో ప్రేమను తెలియజేసి మనుషులను సన్మార్గంలో నడిపేందుకు క్రీస్తు జన్మించవాడన్నారు. యేసుక్రీస్తు పుట్టిరోజున దేశానికి గొప్ప పండుగ అన్నారు. క్రైస్తవులు ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు జరుకోవడం పండుగ విశిష్టతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఆనంద్‌రాజ్, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు మారెన్న పాల్, శ్యాంబాబు, ఉపాధ్యక్షుడు బోనేహర్ బాబు, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి ఏసన్న, ఫాదర్ జ్ఞాన ప్రకాశ్, టీడీపీ జిల్లా నాయకులు బెంగళూర్ కిషోర్, ఎంపీపీ రంగమ్మ తనయుడు వీరేష్, సంఘ పెద్దలుజాన్, రాజన్న, రాజశేఖర్, బాబు పాల్గొన్నారు.

వేరుశనగకు మద్దతు ధర కల్పించాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగకు మద్దతు ధర కల్పించాలని రైతులు కోరారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.6099 పలికింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకంటే క్వింటానికి రూ. 700పైగా తక్కువ పలుకుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు కొంటున్న ధరకు ఏమాత్రం తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే కనీస మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ రంగంలోకి దించి రైతుల నుంచి వేరుశనగను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 320 బస్తాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ రూ.4071, గరిష్ఠ ధర రూ.6009, మధ్యధర రూ.5689 పలికింది.

సుపరిపాలన వారోత్సవాలు

వెల్దుర్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాల వైపు సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా 'సుపరిపాలన వారోత్సవాలు' 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ శుక్రవారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అర్జీలు ఇచ్చిన తరువాత జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు చేరువచేయడమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిశోర్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపించాలి: సీపీఎం



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కౌతాళం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో సర్వే నెంబరు 253లో పేదలకు ఇచ్చిన పట్టాల్లో ఇళ్ల స్థలాలను చూపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీపీఎం నాయకులు, గ్రామ పెద్దలు ఇన్‌చార్జి తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ గ్రామంలో 18 ఏళ్ల కింద పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, నేటికి స్థలాలు చూపకపోవడం శోచనీయమన్నారు. వెంటనే లబ్ధి దారులకు ఇళ్లస్థలాలు చూపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఈరన్న, టీడీపీ నాయకులు బసవరాజు, రామలింగ ఉన్నారు.

అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడడం సరికాదు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడడం సరికాదని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేష్, మండల ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగంపై చర్చ అంశంలో మాట్లాడుతూ అంబేడ్కర్ పేరును పదేపదే ప్రస్తావిస్తూ అవమానించేలా మాట్లాడడం శోచనీయమన్నారు. భారతీయులకు అంబేడ్కర్ కనిపించే దేవుడన్నారు. అలాంటి వ్యక్తిని కించపరిచేలా మాట్లాడిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరాఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోసిగి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 132కేవీ మాధవర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు, సహకరించాలని ఏఈ కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ పట్టణ నాయకులు బందెనవాజ్ అన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో బీవీ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుందన్నారు. క్రీడారంగంలో ఉద్యోగాలు సాధించి ఎందరో గొప్పస్థాయికి చేరుకున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్‌చౌదరి, రంగస్వామిగౌడు, జిలాన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో తాగునీరు, సాగునీరు, సీసీ రోడ్లు, పరిశుభ్రత, వీధి దీపాలు వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ పరమాన్‌దొడ్డి గ్రామంలో నెల రోజుల నుంచి తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గోకులాల షెడ్లు ఏర్పాటు చేసుకున్న వారికి బిల్లులు మంజూరు కాలేదని, హౌసింగ్ శాఖ ద్వారా బిల్లులు మం జూరు చేయించాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రవేశ పెట్టిన పనులను వెంటనే పూర్తి చేసి తాగునీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

కోసిగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోసిగి గ్రామంలో గ్రామ సర్పంచ్ పశువుల హనుమంతమ్మ ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కార్మికులు తొలగించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచినట్లు సర్పంచ్ హనుమంతమ్మ తెలిపారు. కార్యక్రమంలో పశువుల లక్ష్మన్న, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నాడు అలా.. నేడు ఇలా..

- గత వైసీపీ ప్రభుత్వంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్లు
- కూటమి ప్రభుత్వంలో ప్యాచ్‌వర్కులు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రయాణికులు



గత వైసీపీ ప్రభుత్వంలో కోసిగిలోని వాల్మీకి సర్కిల్‌లో రోడ్డు మధ్యలో భారీ గుంతలో నిలిచిన వర్షం నీరు

కోసిగి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పై ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు మధ్యలో నీటి కుంట అనుకుంటే పొరపాట్లే.. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఆర్అండ్‌బీ రోడ్లు గుంతలు పడి చెరువు కుంటను తలపించింది. కోసిగిలోని వాల్మీకి సర్కిల్ రైల్వేగేటు సమీపంలోని ప్రధాన రోడ్డు దుస్థితి ఇది. నాడు వైసీపీ హయాంలో ప్రధాన రోడ్లపై పడ్డ గుంతలపై గంపెడు మట్టి వేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. వర్షం వస్తే గుంతల్లో చేరి నీటి కుంటల్లా మారి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చాలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగైదు నెలల్లోపే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్అండ్‌బీ రోడ్లులో గుంతలు లేని రోడ్లుగా 2025 జనవరి 15 నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు చూస్తారని సీఎం చంద్రబాబు నాయుడు మాట ఇచ్చి ప్యాచ్ వర్కుల కోసం రూ.1800 కోట్లు నిధులు విడుదల చేశారు. అందులో భాగంగా మంత్రాలయం నియోజకవర్గంలో ప్యాచ్‌వర్కుల కోసం రూ. రెండు కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ప్రారంభించారు. నేడు కూటమి ప్రభుత్వంలో కనిపిస్తున్న కోసిగిలోని వాల్మీకి సర్కిల్ ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుకు ప్యాచ్ వర్కులు పూర్తి అయింది. ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే ఈ ఫోటోలో గుంతలు పడి ప్రమాదకరంగా ఆటో ఎలా వెళ్తుందో గమనించవచ్చు. ఇది కోసిగి-ఆదోని ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఈ రోడ్డు గుంతలు పడి సుమారు పది వాహనాలు పైగా బోల్తా పడి ప్రజలుకు గాయాలు కాగా, ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కనీసం అప్పటి నాయకులు, అధికారులు ఆ గుంతలను పూడ్చి మట్టి కూడా వేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ రోడ్డుకు ప్యాచ్ వర్కులు జరగడంతో సాఫీగా ప్రయాణాలు సాగిస్తున్నారు.



ప్యాచ్ వర్క్ పూర్తి చేసిన వాల్మీకి సర్కిల్ రోడ్డు

మూలరాములకు కనకాభిషేకం

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు



మూలరాములకు తులసి అభిషేకం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల హర్షధ్వనుల మధ్య మూలరాములకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కనకాభిషేకం నిర్వహించారు. రాఘవేంద్రస్వామి సన్నిధానంలో శుక్రవారం ధనుర్మాసం పంచమి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని పూర్ణబోధ పూజామందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు అభిషేకం చేశారు. క్షీరాభిషేకం, తులసి అర్చన, పుష్పాభిషేకం, స్వర్ణ నాణేలతో అభిషేకం, వివిధ పదార్థాలతో అభిషేకం పీఠాధిపతి స్వహస్తాలచే చేస్తుండగా వేలాది మంది భక్తులు కనులారా తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అంతకు ముందు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేసి శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులకు పాదపూజ చేసి చెక్క, వెండి, రజిత గజవాహనం, బంగారు నవరత్నాల రథాలపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో మఠం ప్రాంగణం కిక్కిరిసింది. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోణాపూర్, సూపరిటెండెంట్లు రవి కులకర్ణి, అనంత పురాణిక్, విజయేంద్ర ఆచార్, జయతీర్థ ఆచార్ పాల్గొన్నారు.



శ్రీమఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

వినియోగదారుల చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల ఫోరం మెంబర్ నాసిమా కౌసర్, తహసీల్దార్ శేషఫణిలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని దీక్ష కళాశాల విద్యార్థులకు వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 24న వినియోగదారుల (కంజుమర్) దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా అందుకు సంబంధించిన బిల్లును తీసుకోవాలన్నారు. ఎవరైనా నాణ్యతలేని వస్తువులను, ఆహార పదార్థాలను ఇస్తే వారిపై వినియోగదారుల కోర్టులో కేసు నమోదు చేయవచ్చని తెలిపారు. రూ.5లక్షలలోపు ఉచితంగా కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. దీక్షా కళాశాల విద్యార్థుల వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కళాశాల సిబ్బంది, వీఆర్వో మోహన్, కంజుమర్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ ఆటోవర్కర్స్ యూనియన్ ఎల్లవేళలా కృషి చేస్తుందని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆదోని బైపాసు రోడ్డులో ఐఎఫ్‌టీయూ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయం ముందు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేశవులు, రాష్ట్ర కోశాధికారి బాలరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కార్మికులపై చిన్నచూపు చూస్తుందన్నారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం లేనిపోని చట్టాలు తీసుకువచ్చి కార్మికులకు రక్షణ లేకుండా చేస్తుందన్నారు. కార్మికుల సంక్షేమానికి ఐఎఫ్‌టీయూ ఎళ్లవేళలా పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో హనుమంతు, నాగేంద్ర, మల్లికార్జున, రామలింగ, నరసింహులు, లక్ష్మమ్మ, గంగమ్మ, ఖాజా, చంటి పాల్గొన్నారు.

సర్వమతాలు శాంతిని బోధిస్తున్నాయి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి
- పాస్టర్లకు దుస్తులు పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సర్వమతాలు శాంతిని, మంచి మార్గాలను బోధిస్తున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో తన నివాసంలో క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని అన్ని సంఘాల పాస్టర్ల దంపతులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరం ఎన్నో అనుభవాలు నేర్చు కుంటూ కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామని, ప్రతి ఒక్కరూ శాంతి, సహనం, ఐక్యంగా మంచి మార్గంలో పయనించాలని అన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు రఘునాథ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, కోసిగి నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, రామకృష్ణ, బసలదొడ్డి ఈరన్న, సురేష్ నాయుడు, పాస్టర్లు శామూయేల్, దానియేలు, రాజు, ప్రసాద్, సామేల్, యాకోబు, మీకాయేలు, మలాకి, ప్రభుదాసు, అబ్రహాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆలయ వార్షికోత్సవం

కౌతాళం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ పదవ వార్షికోత్సవాన్ని శని, ఆదివారాలల్లో నిర్వహిస్తున్నట్లు పూజారి రాజన్న స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పది సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. శనివారం హోమాలు, ఆదివారం సీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

మూలకు చేరిన చెత్త సేకరణ సైకిళ్లు



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ట్రై సైకిళ్లు

కౌతాళం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో గ్రామాల్లో చెత్త సేకరణ కోసం ప్రతి పంచాయతీకి రెండు ట్రై సైకిళ్లు పంపిణీ చేసింది. కానీ, అవి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. దాంతో లక్షల ప్రజాధనం వృథా అయింది. ప్రస్తుతం వాటి నిర్వహణ లేకపోవడంతో, కొన్ని పంచాయతీలు వాటిని తీసుకుపోయేందుకు కూడా ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో వృథాగా మూలనపడ్డాయి. వాహనాలు నిలిపేందుకు ఇబ్బందిగా మారడంతో కార్యాలయం కాంపౌండ్‌పైకి ఎక్కించారు. ఇది చూసిన సందర్శకులు ట్రైసైకిళ్లు గోడపైకి ఎక్కాయంటూ నవ్వుకుంటున్నారు.

తాగునీటి ట్యాంకు వద్ద పందులు

ఆందోళన వ్యక్తం చేస్తున్న మూగలదొడ్డి గ్రామస్థులు



మూగలదొడ్డి ప్రాథమిక పాఠశాలలో తాగునీటి ట్యాంకు పరిసరాల్లో పంది

కోసిగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో రోజురోజుకు పందుల బెడద తీవ్రం అవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోసిగికి చెందిన కొందరు పందుల యజమానులు రాత్రివేళల్లో పందులు తీసుకువచ్చి గ్రామంలో వదిలారని వాపోయారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణంలోకి పందులు వస్తున్నారని, తాగునీటి ట్యాంకు వద్ద మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చిన్నారులపై దాడులు చేస్తున్నారని వాపోయారు. అలాగే గ్రామ శివారులోని పంటలను నాశనం చేస్తున్నాయని, రూ. లక్షలు పెట్టుబడులు పెడితే.. పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది పందుల యజమానులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దిష్టిబొమ్మల్లా నీటి గుమ్మీలు



తారాపురంలో నిరుపయోగంగా నీటి గుమ్మీలు

పెద్దకడుబూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి, అక్కడక్కడ నీటి గుమ్మీలను ఏర్పాటు చేసింది. ఆయా గ్రామాల్లో నీటి గుమ్మీలకు నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా ఒక వాటర్ మ్యాన్‌ను సైతం ఏర్పాటు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం, వాటర్ మ్యాన్‌ల అలసత్వంతో కొన్ని గ్రామాల్లోని నీటి గుమ్మీలు దిష్టిబొమ్మల దర్శనమిస్తున్నాయి. అంతేగాక గుమ్మీలను శుభ్రం చేయకపోవడంతో నీరు కాస్తా కలుషితం అవుతోంది. మండలంలోని తారాపురం, హెచ్.మురవణి తదితర గ్రామాల్లో నీటి గుమ్మీలను పట్టించుకోకపోవడంతో అవికాస్తా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని గ్రామాల్లో వీటిని వినియోగించుకోకపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడంలేదు. అధికారులు స్పందించి గుమ్మీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

నందవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పిల్లల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ముగతి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు ఏళ్ల నుంచి ఆరేళ్ల చిన్నపిల్లల్లో బాల్యం ఆరంభ దశలో విద్య పోషణ సమగ్ర అభివృద్ధికి జరుగుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురిం చి వివరించారు. శిక్షణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత, వెంకట రమణ, కల్పన, సుపర్ణ, సీఆర్ఎం ఉరుకుంద పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

కోసిగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని రంగప్పగట్టు సమీపంలో ఉన్న మౌంట్ కార్మెల్ హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శుక్రవారం కోసిగిలో ఎంఆర్‌సీ కార్యాలయం దగ్గర డీఈవో శామ్యూల్ పాల్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ కూతురు మేఘన పాఠశాలలో 6వ తరగతి చదువుతోందని, ప్రతి నెల 25న బస్సు ఫీజు చెల్లిస్తున్నామని, ఈ నెల 17న బస్సు ఫీజు చెల్లించాలని పాఠశాల యజమాన్యం కర్రతో వాతలు పడేటట్లు చితకబాదరని కోసిగి గ్రామానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు పందికోన నాగేష్, రాణి ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఒక్కో విద్యార్థి నుంచి రూ.500లు బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

నెట్ బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంటులో జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా నెట్‌బాల్ సం ఘం వ్యవ స్థాపకుడు నాగరత్నమయ్య అన్నారు. స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా నెట్‌బాల్ క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెట్‌బాల్ చైర్మన్ ఆనందరావు, అధ్యక్షుడు నాగేశ్వరరావు, వంశీకృష్ణ, కోచ్‌లు పాల్గొన్నారు.

నాగలదిన్నెలో రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

నందవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఆర్ఐ జర్మియా ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. ప్రజలు, రైతులు ఇచ్చిన వినతులను తీసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమా వేశంలో డీటీ మహేష్, టీడీపీ నాయకులు జబ్బార్, టీ ఈరన్న, వహబ్, తిమ్మప్ప, సుదీర్, కిషోర్, అరుగోలు వీరేష్, వీఆర్వో పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: భూ సమస్యలుంటే తక్షణమే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసేందుకు గ్రామాల్లో సభ లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరగకుండా ప్రభుత్వం అధికారులనే రైతుల దగ్గరకు పంపిందన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించుకో వాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో అనంతలక్ష్మి, గ్రామ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దుమ్ము ధూళితో ప్రయాణికుల ఇక్కట్లు



ఎమ్మిగనూరు- కోసిగి రోడ్డులో ఎగిసిపడుతున్న దుమ్ము

పెద్దకడబూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు-కోసిగి ప్రధాన రహదారిలో వాహనాదారులు, ప్రయాణికులు అష్టకష్టాలు పడుతు న్నారు. రోడ్డు మొత్తం గోతులు పడిం ది, రాళ్లు తెలడంతో వాహనాలు వెళ్లిన ప్పుడు దుమ్ము ధూళి ఎగిసిపడు తుంది. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.